# విలీనం.. స్కూళ్లు నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తోందనే విమర్శలొస్తున్నాయి. ప్రధానంగా పిల్లల సంఖ్య పడిపోయిందనే నెపంతో స్కూళ్లను విలీనం చేస్తుండడ కొన్ని ప్రాంతాల స్కూళ్లకు శాపంగా మారింది. తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత, ఆందోళన, నిరసనలు వ్యక్తమైనా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. మరోవైపు విలీన ప్రక్రియ ప్రైవేటు స్కూళ్లకు అనుకోని వరంలా లభించింది. తమ పిల్లలను విలీన స్కూళ్లకు బదులు ప్రైవేటు స్కూళ్లకు పంపడానికి కొన్నిచోట్ల మొగ్గు చూపుతున్నారు.

- బోసిపోతున్న ప్రభుత్వ బడులు
- విలీనంతో 139 చోట్ల తలెత్తిన సమస్య
- టీచర్ల బదిలీలతో విధుల్లో చేరని 700 మంది
- బదిలీ అయిన టీచర్లు వచ్చే వరకూ ఉన్న టీచర్లను రిలీవ్ చేయని పరిస్థితి
- డీఎస్సీ నియామకాల వరకు తప్పని సమస్య



పలమనేరు మండలంలోని గజ్జలవారిపల్లి ప్రైమరీ స్కూల్


బడిలో కేవలం ముగ్గురు పిల్లలే ఉన్న దృశ్యం

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలు విలీనం చేసిన చోట్ల పిల్లలు రాక, మరోవైపు టీచర్ల బదిలీలతో బడుల్లో టీచర్ల లేక బోసిపోతున్నాయి. పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో దాదాపు 700మంచి టీచర్లు విధుల్లో చేరాల్సి ఉంది. ఏకోపాధ్యాయులు ఉన్న స్కూళ్లలో కొత్త టీచర్లు విధుల్లోకి చేరేవరకూ వీరికి బదిలీలు లేకుండా పోయాయి.

**పక్క గ్రామాలకు పిల్లల్ని పంపమంటున్న తల్లి దండ్రులు**

అయా గ్రామాల్లోని బడులను పొరుగు గ్రామాల్లోని ఎక్కువ పిల్లలున్న చోట్లకు మార్చి వాటిని మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా కూటమి ప్రభుత్వం మార్చింది. ఇందులోనూ విలీనం చేసిన బడుల్లోని 3,4,5 తరగతుల పిల్లలను మాత్రమేనని మెలిక పెట్టింది. మిగిలిన 1,2 తరగతులను ఫౌండేషన్ స్కూళ్లగా మార్చింది. దీంతో విలీనం సరికొత్త సమస్యలను సృష్టించి గ్రామాల్లో తల్లిదండ్రులకు ఆగ్రహం తెప్పిస్తోంది. పలు మండలాల్లో రెండు, మూడు కిలోమీటర్లలోని పక్క గ్రామానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు లేవు. దీంతో చిన్నపిల్లలు పక్క గ్రామాలకు ఎలా పంపేదని తల్లిదండ్రులు ప్రశ్నకు విద్యాశాఖ నుంచి సమాధానం లేదు.

**ఏడొందల మంది విధుల్లో చేరేదెప్పుడు?**

మూడు నియోజకవర్గాల్లో బదిలీ అయిన టీచర్లు 700 వరకూ ఉన్నారు. వీరి స్థానంలో రిలీవ్ అయిన వాళ్లు, కొత్తగా డీఎస్సీలో పోస్టులు పొందేవాళ్లు రావాల్సి ఉంటుంది. అంతవరకూ సింగిల్ టీచర్లే దిక్కు. బైరెడ్డిపల్లె మండలంలో 129మంది బదిలీకాగా 49మంది బదిలీపై రావాల్సి ఉంది. దీంతో 90 దాకా వేకెన్సీలున్నాయి. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ ఉంది.

**ప్రైవేటు స్కూళ్ల సంబరం**

విలీనం దెబ్బకు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు కొన్ని మూసివేత దిశగా సాగుతున్న పరిణామాలు పిల్లల తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు విలీన నిర్ణయం ప్రైవేటు స్కూళ్లకు ఆయాచిత వరమైంది. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల క్షేమం, భద్రత దృష్ట్యా గ్రామాలకు వచ్చే ప్రైవేట్ బడుల్లో పిల్లలను చేర్పించడానికే మొగ్గు చూపుతున్నట్టు కొన్నిచోట్ల ఉదంతాలు అద్దం పట్టాయి. మరోవైపు ఆర్థిక స్తోమతలేని దూరంలోని స్కూళ్లకు పంపే స్తోమత లేక చదువులకు స్వస్తి పలికించే అవకాశమూ ఉంటోంది. మరోవైపు ఎక్కడైతే బడిని పక్క గ్రామానికి విలీనం చేశారో ఆ గ్రామాల్లోకి ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వెళ్లి మీ గ్రామానికే బస్సు పెడుతున్నాం.. మా బడిలో చేరండంటూ విస్తృతంగా ప్రచారం చేస్తుండడం, అలాగే ప్రైవేటు స్కూళ్లలో చేరినా «తల్లికి వందనం» వస్తుందని చెబుతుండడంతో పిల్లల తల్లిదండ్రులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. చివరకు కూటమి సర్కారు విలీన ప్రయోగం అంతిమంగా ప్రైవేటు స్కూళ్లకే లాభిస్తోందనేది తేటతెల్లమవుతోంది.

**ప్రాథమిక విద్య సర్వనాశనం**



స్కూళ్ల విలీనంతో పొరుగూర్లలోకి పిల్లల్ని పంపమని తల్లిదండ్రులు తేల్చిచెబుతున్నారు. బదిలీ అయిన టీచర్లలో కొందరు వారి స్థానాల్లోకి చేరారు. మిగిలిన వారు సింగిల్ టీచర్లుగా బడుల్లో ఉన్నారు. అక్కడికి టీచర్ల వస్తేగానీ వీరిని రిలీవ్ చేయరట! మా మండలంలోనే 90 మంది టీచర్లు రావాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం మేలు చేయకపోగా ప్రైవేటు స్కూళ్లకు బంపరాఫర్ ఇచ్చినట్టైంది. ప్రభుత్వం దీనిపై ఆలోచన చేయాలి.

–మొగసాల రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లె

**చిన్న పిల్లలను పక్క ఊరికి ఎట్లా పంపేది?**



మా ఊరి బడిలో 30మంది పిల్లలున్నారు. మా బడిని 2 కిలోమీటర్లలోని కల్లాడు బడికి విలీనం చేశారు. ఆ దార్లో ఎప్పుడు చూసినా జల్లిటిప్పర్లు వేగంగా వస్తుంటాయి. మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద వరదనీరు చెరువులా ఉంది. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో పిల్లల్ని అక్కడికి పంపలేము. మా ఊరి బడిని తెరవాల్సిందే.

–వెంకటేష్, పాలమాకులపల్లె

## క్లుప్తంగా

### కుమార షష్ఠి పూజలు


విశేషాలంకారంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

సదుం: స్థానిక గార్గేయ నదీ తీరాన ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం కుమారషష్ఠి పూజలు నిర్వహించారు. ఆలయంలో నేరేడు కాయలు, వీభూదితో అభిషేకాలు చేశారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. వారికి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### బదిలీ టీచర్లకు సన్మానం


బదిలీ టీచర్లను సన్మానిస్తున్న సహచరులు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్ఎం హైమావతి, టీచర్లు చిన్న రెడ్డెప్ప నాయుడు, రమేష్, రంగారెడ్డి, వెంకట నారాయణకు మంగళవారం సహచర టీచర్లు వీడ్కోలు సన్మానం చేశారు. వారి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అఫీజుల్లా, కళ్యాణి, జాఫర్, గుర్రప్ప, శుభాకర్, స్వర్ణలత, సంపూర్ణ, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### భక్తులతో బోయకొండ కిటకిట

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ


భక్తుల రద్దీ

చౌడేపల్లె: ఆషాఢ మాసం మంగళవారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోర్కెలు ఫలించిన భక్తులు మొక్కులు చెల్లించారు. క్యూలన్నీ రద్దీతో కిక్కిరిశాయి. దాదాపు 15 వేల మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను అందజేశారు.

### వైభవంగా గంగమ్మ జాతర


భారత్ నగర్‌లో గంగమ్మ

వి.కోట: పట్టణంలోని భారత్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచే మహిళలు పొంగళ్లు, దీపారాధనలు ప్రారంభించారు. సోమవారం రాత్రి అమ్మవారి శిరస్సును పట్టణ, గ్రామ వీధుల్లో ఊరేగించారు. మంగళవారం ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పూలగెరిగ, డప్పులు, బాణసంచా మోత నడుమ అమ్మవారి శిరస్సును ఘనంగా ఊరేగించారు. అనంతరం విశ్వరూప దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. మొక్కులు చెల్లించి అన్నదానం చేశారు.

### ప్రత్యేక అలంకరణలో వైష్ణవీదేవి

చౌడేపల్లె: మండలంలో పుదిపట్లలోని వైష్ణవిదేవి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజైన మంగళవారం ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని కొలువుతీర్చారు. దీనికి ఉభయదారులుగా మదనపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి దంపతులు వ్యవహరించినట్లు అర్చకురాలు శ్రావణి తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం వారాహి పారాయణం చేశారు.

### ఆర్టీఓ కార్యాలయంలోనే ఎఫ్‌సీ ఇవ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయంలోనే వాహనాల ఎఫ్‌సీలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలో ఎఫ్‌సీలు చేయకుండా చిత్తూరుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉండే నలగంపల్లె వద్ద ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం సరికాదని నిరసించారు.

# కుట్టు.. కనికట్టు..!

- మొరాయించిన కుట్టు మెషిన్లు
- పట్టించుకోని అధికారులు
- మహిళలకు కలగా మిగులుతున్న టైలరింగ్ శిక్షణ

రొంపిచెర్ల: మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన టైలరింగ్ శిక్షణ అధికారుల నిర్లక్ష్యం వలన లక్ష్యం మండలంలో నీరుగారిపోతుంది. వివరాలు.. మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ సాయంతో అనంతపురం జిల్లాకు చెందిన ఒక కంట్రాక్టర్ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణకు మండలంలో 260 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. దీంతో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు 25 కుట్టు మెషిన్లు కూడా ఇచ్చారు. అయితే వాటిలో 19 మెషిన్లు 25 రోజుల క్రితమే మొరాయించి మూలన పడ్డాయి. మరమ్మతులకు గురైన వాటి గురించి టైలరింగ్ శిక్షణ నిర్వాహకులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. మూడు నెలలు పాటు ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు శిక్షణ తరగతులకు హాజరైన వారికి మాత్రమే కుట్టుమెషిన్లు ఉచితంగా ఇస్తామని మొదట్లో ఊదరగొట్టారు. అయితే పని చేయని మెషిన్ల మూలాన శిక్షణకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కుట్టు మెషిన్లు పనిచేయకపోవడంతో మరోవైపు శిక్షణకు వచ్చే మహిళల సంఖ్య కూడా తగ్గుతోంది. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు కుట్టు మెషిన్లు బాగు చేయించాలని మహిళలు కోరుతున్నారు.


రొంపిచెర్ల టైలరింగ్ శిక్షణ కేంద్రంలో పనిచేయని కుట్టు మెషిన్లు

# రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు (చౌడేపల్లె): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడిన సంఘటన పుంగనూరు మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి అరుణ్‌కుమార్(10)ని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు ఆర్టీఓ కార్యాలయం సమీపంలో మోటార్ సైక్లిస్టును వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మదనపల్లె మండలం రామాచార్లపల్లె చెందినబాలాజి(34) గాయపడ్డాడు. గాయపడిన వారిని స్థానికులు 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పుంగనూరులో బస్సు ఢీకొనడంతో గాయపడిన విద్యార్థి అరుణ్

# స్కూల్ బస్సులు తనిఖీ

పుంగనూరు (చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డులో ఎంవీఐ సుప్రియ స్కూల్ బస్సులను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు, సామర్థ్య పత్రాలు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించి ఆమె మాట్లాడారు. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి తిరిగి ఇంటికి చేర్చే వరకు బాధ్యత తమపై ఉందనేది బస్సు డ్రైవర్లు గుర్తెరిగి సురక్షితంగా చేర్చాలన్నారు. ఇష్టానుసారంగా బస్సులు నడిపి ప్రమాదాలకు తావిచ్చినా, నిబంధనలు అతిక్రమించినా వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించి, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.


పుంగనూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ సుప్రియ

# బోన్ క్యాన్సర్ బాధితునికి ఎమ్మెల్యే సాయం

- చేయూతనివ్వడంతోపాటు పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయిస్తామని భరోసా

చౌడేపల్లె: బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థి షాహిద్‌కు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఆస్పత్రిలో అయ్యే ఖర్చుకు తమ చేయూతతోపాటు ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. వివరాలు..చౌడేపల్లె–గడ్డంవారిపల్లె రోడ్డులోని జగనన్న కాలనీలో నివాసమున్న షాజహాన్, నాహీరాల కుమారుడు షాహిద్ ఇటీవల పదోతరగతి 472 మార్కులతో పాసయ్యాడు. 2024 డిసెంబర్‌లో ఇంటి వద్ద కబడ్డీ ఆడుతుండగా జారిపడడంతో కుడి చేతికి గాయమైంది. ఆ తర్వాత రోజుల కాలంలో ఆ నొప్పి తీవ్రం కావడంతో పుంగనూరు, మదనపల్లె, తిరుపతి చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి బోన్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. కార్పెంటర్‌గా పని చేస్తున్న అతడి తండ్రి సుమారు రూ.2 లక్షలు పైగా ఖర్చుచేశారు. ప్రస్తుతం కీమోథెరపీ చేస్తున్నట్లు తెలిపారు. అతడి సమస్యను వైఎస్సార్‌సీపీ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు మాజీమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సహకారంతో రూ10 వేలను బాధితుడి తల్లితండ్రులకు అందజేశారు. ఇంకనూ ఆసుపత్రికి అయ్యే ఖర్చును ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో పీఎం రిలీఫ్ ఫండ్‌తోపాటు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్తాఫ్ పాల్గొన్నారు.


చౌడేపల్లెలో నగదును అందజేస్తున్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు

# ఘనంగా డాక్టర్స్ డే


వైద్యులను సన్మానిస్తున్న హెల్త్ ప్రొవైడర్లు


బుద్ధిమాంద్యం పిల్లలకు వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని కమ్యూనిటీ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్థోపెడిక్ డాక్టర్ నాగరాజు, అనీఫ్, ఎండీ జయశంకర్‌ను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నాయకులు జనార్ధన్ వైద్యుల సేవలను కొనియాడారు. అసోసియేషన్ నాయకులు మనోహర్, వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక రిమ్మర్స్ బుద్ధిమాంద్యం పిల్లలకు గంగవరం వైద్యాధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులను సంస్థ నిర్వాహకులు సుధాకర్ సన్మానించారు. స్థానిక సేవా కార్యకర్తలు మధు బృందం పట్టణంలోని డాక్టర్ సుశీలను సన్మానించారు.. ఇక్కడి ప్రజలకు ఆమె తక్కువ ఫీజుతో సేవలు అందిస్తున్నారని కొనియాడారు.

**వైద్యాధికారులకు సత్కారం**

గంగవరం: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరిని వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైద్యులు దైవంతో సమానమని, వారిని తగిన రీతిలో సత్కరించుకోవడం తమ ధర్మమంటూ వారి సేవలను ప్రస్తుతించారు.

**సమాజ సేవే లక్ష్యం**

గుడుపల్లె: సమాజ సేవే లక్ష్యంగా వైద్యులు ముందుకు సాగాలని పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హెచ్‌ఆర్ క్రిష్టారావు అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వైద్య విద్య సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైద్య విద్య పూర్తి చేసిన వైద్యులు సేవా దృక్పథంతో సమాజానికి సేవలు అందించినప్పుడే ఆ విద్యకు విలువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సుబ్రమణ్య, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


డాక్టర్ సుశీలను సన్మానిస్తున్న సమాజ సేవకులు


వైద్యులను సత్కరిస్తున్న సిబ్బంది


ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ క్రిష్టారావు

# సామాజిక సేవలకు అధిక ప్రాధాన్యత

పుంగనూరు(చౌడేపల్లె): లయన్స్ క్లబ్ నిర్వహించే కార్యక్రమాలలో ఎక్కువగా సామాజిక సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యత ఇస్తామని డాక్టర్ శివ, వరదారెడ్డి తెలిపారు. 2025–2026 సంవత్సరానికిగాను లయన్స్‌క్లబ్ పుంగనూరు నోబుల్ జిల్లా స్థాయిలో డాక్టర్ పి.శివను జిల్లా అంబాసిడర్‌గా, వరదారెడ్డిని జిల్లా చైర్మన్‌గాను నియమించినట్లు లయన్స్ క్లబ్ గవర్నర్ అశ్వర్థ నారాయణస్వామి తెలిపారు. వారు మాట్లాడుతూ 2026 సంవత్సరం వరకు జిల్లాలో నిర్వహించే వైద్య, ఉచిత కంటి వైద్యశిబిరాలు, చక్కెరవ్యాధి పరీక్షలను విస్తృతం చేస్తామన్నారు. వీరిని ముత్యాలు, బాలసుబ్రమణ్య, డాక్టర్ సరళ, రఘుపతి, కేశవరెడ్డి, త్రిమూర్తిరెడ్డి తదితరులు అభినందించారు.



డాక్టర్ శివ, వరదారెడ్డి

# శుభారాం ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్

పుంగనూరు (చౌడేపల్లె): పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను లెక్చరర్లు, సిబ్బంది అభినందించారు. ఆయన మాట్లాడుతూ. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని విభాగాల సిబ్బంది సమన్వయ సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.


బాధ్యతలు స్వీకరిస్తున్నన శ్రీనివాస్

# సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం

పట్టణంలో మంచినీటి సరఫరా కట్!


రిలేదీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకూ వర్తింపజేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని పలమనేరు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు వారం రోజులుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. సమస్యలపై ఎలాంటి స్పందన రాకపోవడంతో పట్టణంలో మంచినీటి సరఫరాను ఆపేశారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో తాము రూ.13వేల జీతంతో పని చేస్తున్నామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రభుత్వ పథకాలు వర్తింపజేయకపోవడం దుర్మార్గమని నిరసించారు.

## నోటీస్ బోర్డు

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై నేడు సమావేశం

పలమనేరు: ఇంటింటా వంచన, బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచార కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఉదయం 10.30 గంటలకు గంగవరంలోని ఆర్‌వీఆర్ టవర్స్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పలమనేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎన్ వెంకటేగౌడ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. చంద్రబాబు మోసం చేసిన మేనిఫెస్టోను ప్రజలకు గుర్తు చేస్తూ ఐదు వారాలపాటు ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

### సమస్యల పరిష్కారానికే గ్రామసభ


గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్, ఈఓ

వి.కోట : పంచాయతీలో ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీలో వీధిలైట్లు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, ఆదాయ వనరులు..ఇత్యాది వాటిపై చర్చించారు. గ్రామ సభలో ప్రజలు నివేదించిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు కుమార్ రాజా, విశాలాక్షి, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పర్యటించిన కేంద్ర బృందం


చెత్త సేకరణ పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు హేమంత్

పెద్దపంజాణి: మండలంలోని బొమ్మరాజుపల్లె, అమ్మరాజుపల్లె పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను మంగళవారం కేంద్ర బృందం పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ ఎలా ఉంది? అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, అంగన్‌వాడీ, పాఠశాలలు, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు హేమంత్, డిప్యూటీ ఎంపీడీఓ శారదాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, సర్పంచ్ శారద, ఎంఆర్‌సీ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.